## క్లుప్తంగా

### రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈలి గోపాలం

కడియం: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం అన్నారు. మండలంలోని దుళ్ల ఆర్బీకే – 2 వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. కొనుగోలు తీరును విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సరోజ వివరించారు. చైర్మన్ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు తాతపూడి బాబీ, ఉరదాల శ్రీరాములు, కొండపల్లి నాని, స్థానిక రైతులు ఉన్నారు.

### కులగణన సర్వే పక్కాగా నిర్వహించాలి

కడియం: రాష్ట్ర ప్రభుత్వం కులగణనను పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టిందని, క్షేత్రస్థాయి సిబ్బంది అందుకు సమాయత్తం కావాలని ఎంపీడీవో కె.రత్న కుమారి ఆదేశించారు. డిసెంబర్ 10 నుంచి కులగణన ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల అవగాహనా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్ అప్లికేషన్ ద్వారా కులగణన ప్రక్రియను నమోదు చేయాలన్నారు. సంబంధిత వివరాల నమోదుపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని సర్వేను సక్రమంగా పూర్తి చేయాలన్నారు.

### బాలుర పర్యవేక్షణ గృహం సందర్శన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. పర్యవేక్షణ గృహంలోని బాలురతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వారి కోసం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకోవాలన్నారు. క్రమశిక్షణ, సహనశీలత మనిషికి ఉండాల్సిన ముఖ్యమైన లక్షణాలన్నారు. వాటిని అలవర్చుకుని మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

### ఎస్‌కేఆర్ మహిళా కళాశాలపై న్యాయపోరాటం

కంబాలచెరువు: తన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ మూడు నెలలుగా ఎస్‌కేఆర్ ఎంబీఏ మహిళా కళాశాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని, ఇంకా వెతుకుతున్నామని కళాశాల ఇన్‌చార్జి వి.విద్యాప్రతిమ చెబుతున్నారని ఎంబీఏ విద్యార్థిని సీహెచ్.రమా సుహర్షిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలకు బాధిత విద్యార్థి తన తల్లిదండ్రులతో కలసి వెళ్లి సర్టిఫికెట్లను అడిగారు. ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి సీహెచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళాశాలలో సిబ్బంది, యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల తన కూతురి జీవితం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వాలని అడుగుతుంటే, కనిపించడం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. సర్టిఫికెట్లను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టిన కళాశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి, విద్యార్థి ఉద్యమ నాయకులతో కలిసి న్యాయం కోసం పోరాడమతామన్నారు.

### చందన నాగేశ్వర్ పరామర్శ



గిరజాల శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న హుకుంపేట–4 గ్రామ సచివాలయ కన్వీనర్ గిరజాల శ్రీనివాస్‌ను శుక్రవారం రాత్రి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, పార్టీ నాయకులు వి.నాగబాబు, కుప్పాల రాంబాబు పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- కమ్యూనిటీహాలు నిర్మాణానికి సహకరిస్తా
- దివాన్ చెరువు బీసీ నాయకులకు ఎంపీ భరత్ రామ్ హామీ



ఎంపీ భరత్ రామ్‌ను కలిసిన దివాన్ చెరువు బీసీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బీసీల సంక్షేమం, అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివిధాలుగా సహకరిస్తున్నారని, ఆయనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బీసీ సామాజిక వర్గీయులకు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను శుక్రవారం ఉదయం దివాన్ చెరువు గ్రామానికి బీసీ సామాజిక నాయకులు, యువత కలిశారు. ఎంపీకి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ గౌడ, శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రభుత్వ పరంగా సహకరించాలని కోరారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎంపీ భరత్‌రామ్‌కు అందజేశారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ దివాన్ చెరువులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తప్పక సహకరిస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అవసరమైన స్థలం ఉందా అని అడగడంతో పాటు తహసీల్దార్, వీఆర్వోలను అడిగి ప్రభుత్వ స్థలం ఎక్కడైనా ఉంటే దాని వివరాలతో దరఖాస్తు చేసుకుంటే వెంటనే జాయింట్ కలెక్టర్‌కు చెప్పి మంజూరు చేయిస్తానన్నారు. అలాగే సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరుతో పాటు ఆర్థికంగా కూడా సహకరిస్తానన్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తన వంతుగా రూ.20 లక్షల నిధులు మంజూరు చేయిస్తానన్నారు. సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారో అందరూ ఏకాభిప్రాయంతో తెలిపితే పది రోజుల్లో విగ్రహాన్ని అందజేస్తానని ఎంపీ భరత్ హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో దివాన్ చెరువు గ్రామ బీసీ నాయకులు మార్గాని శ్రీను(ఎంఎస్సార్), మార్గాని రాజుగారి శ్రీను, బదుగు గోపి, మార్గాని చంటి, పీఎస్ఆర్ పండు, తరుణ్ కుమార్, మార్గాని శ్రీను ఉన్నారు.

**మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా**



మృతుడి కుటుంబానికి బీమా పత్రాలు అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: దురదృష్టవశాత్తూ ఎవరైనా మృతి చెందితే, వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆసరాగా నిలుస్తోందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. తాడితోట ఆవరోడ్డులో నల్లా రాజు కుటుంబానికి శుక్రవారం రూ.5 లక్షల బీమా పత్రాలను అందజేశారు. స్థానిక 15వ డివిజన్‌లో ఇన్‌చార్జి ముత్యాల వీర అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ నెల రోజుల క్రితం రాజానగరం సమీపంలోని గైట్ కళాశాల వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో నల్లా రాజు అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, మృతుడి కుటుంబ పరిస్థితిని వివరించడంతో కేవలం నెల రోజుల్లోనే బీమా సొమ్ము మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంకె సురేష్, ఉదయ్ రాణా, వెల్ఫేర్ సెక్రటరీ చవ్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### నేడు గౌతమ్ యూరాలజీ సెంటర్‌లో వైద్యశిబిరం

కంబాలచెరువు: గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ సెంటర్‌లో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ క్యాంపులో 50 శాతం ల్యాబ్ టెస్టులు, ఫ్రీ కన్సల్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

కంబాలచెరువు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తాడితోటలోని సంహిత డిగ్రీ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ కొందరు యువత మత్తు పదార్థాలకు బానిసలై, తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లంక సత్యనారాయణ, కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో జి.బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 37వ డివిజన్‌లో పర్యటన



మహిళకు నమస్కరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక 37వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేసిన పథకాల లబ్ధిని వారికి వివరించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయం కేంద్రంగా ప్రభుత్వం సంక్షేమం అందిస్తోందన్నారు. వలంటీర్ల ద్వారా పథకాలన్నీ అర్హుల గడప ముంగిటకే వస్తున్నాయన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు మళ్లీ సీఎంగా దీవించాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, పార్టీ నాయకులు సబ్బారపు సూరిబాబు, బాలాజీ రెడ్డి, చోడదాసి సుందర్ సింగ్, దుంగ మంగాలక్ష్మి, నామన వాసు, బురిడి త్రిమూర్తులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం

- అర్హులందరూ నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ మాధవీలత




ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ మాధవీలత పిలుపునిచ్చారు. స్పెషల్ సమ్మరీ స్వీప్ – ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక వై.జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎలక్టోరల్ నమోదు అధికారి కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఓటరు నమోదుపై అవగాహన కల్పించే ఎల్ఈడీ స్క్రీన్‌తో గల వాహనాన్ని, ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విస్తత స్థాయిలో స్పెషల్ సమ్మరీ కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును ఉందో, లేదో సరిచూసుకోవాలన్నారు. 2024 జనవరి ఒకటికి 18 ఏళ్లు నిండే వారందరూ అర్హులేనన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఎనిమిది కూడళ్లలో కియోస్కోలను ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా ఓటు నమోదు, మార్పులు చేర్పులు తదితర వాటి కోసం ప్రజలు కియోస్కోలను సందర్శించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ స్వీప్ కార్యాచరణలో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీవో జేవీ సత్యనారాయణ, అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య గౌడ్, చిత్రంలో ఎంవీఐ సంపత్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: స్కూలు బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, క్రమశిక్షణతో వాహనాన్ని నడపాలని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్ సూచించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శుక్రవారం కాతేరులోని తిరుమల జూనియర్ కళాశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. వీరయ్య గౌడ్ మాట్లాడుతూ ఇటీవల విశాఖలో జరిగిన స్కూలు పిల్లల ఆటో ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని స్కూల్ బస్ డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు గమనించి, సహాయకుడుగా ఉన్న వ్యక్తి ద్వారా ఆ విద్యార్థులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చాలన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థల అనుమతితో స్కూలు బస్సులకు నిర్ణీత కాలంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి డ్రైవర్లు కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. త్రీటౌన్ ఎస్సై రామకృష్ణ, తిరుమల విద్యాసంస్థల ప్రతినిధి నున్న సురేష్ పాల్గొన్నారు.

### నేడు వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

రాజమహేంద్రవరం రూరల్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర జిల్లా స్థాయి ప్రారంభ ప్రచార కార్యక్రమం కోలమూరు గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. పథకాలు, లబ్ధిదారుల సమాచారంతో అధికారులందరూ హాజరుకావాలన్నారు.

# ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు



డీటీసీపీ డైరెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందిస్తున్న జగ్గారావు తదితరులు

సీటీఆర్ఐ: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల్లో వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు ఇన్‌చార్జిలుగా ప్రమోషన్లు ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వార్డు ప్లానింగ్ – రెగ్యులేషన్ సెక్రెటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దడాల జగ్గారావు అన్నారు. శుక్రవారం విజయవాడలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్లానింగ్ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్లానింగ్ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారావు మాట్లాడుతూ త్వరలోనే రెగ్యులర్ స్కేల్‌తో కూడిన ప్రమోషన్లు సాధించడమే లక్ష్యమని ప్లానింగ్ కార్యదర్శుల అసోసియేషన్ తీర్మానం చేసిందన్నారు. ఈ విషయంపై డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించామన్నారు. ప్రభుత్వం పరంగా ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా ఇంత తొందరగా ప్రమోషన్లు ఇస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్లానింగ్ కార్యదర్శుల తరఫున కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా విధులు నిర్వర్తిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ పిల్లి హరీష్, ప్రధాన కార్యదర్శి మేలుగమ్మ రవికుమార్, సొంగ చైతన్య, నవీన్, జీవన్, రాజు, పాల్ పాల్గొన్నారు.

# జగన్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- ఆయనను సీఎంగా మరోసారి ఆశీర్వదించండి
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీ భరత్ రామ్



అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు రెడ్డి, పాలిక శ్రీను



ధవళేశ్వరంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జగన్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఆయనను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి జగనన్న వల్లే సాధ్యమైందని, అందుకే ముఖ్యమంత్రిగా జగనన్న మళ్లీ చూడాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నర సంవత్సరాలలో పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్లను నేరుగా జమ చేశారన్నారు. ప్రజలందరికీ పార్టీ రహితంగా, నిష్పక్షపాతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సిటీ నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి, సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు కేంద్రంగా నిర్మాణాత్మకమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఆర్‌వీ నగర్ 75వ సచివాలయం పరిధిలో సుమారు రూ.16.85 కోట్లు, మంగళవారపుపేట 51వ సచివాలయం పరిధిలో రూ.17.14 కోట్లు, 39 డివిజన్ కృష్ణ నగర్ 67వ సచివాలయంలో రూ.14.68 కోట్లు, 8వ డివిజన్ 15వ సచివాలయం పరిధిలో రూ.7.39 కోట్ల మేర లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ప్రెసిడెంట్లు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, అజ్జరపు వాసు, పెంకే సురేష్, పార్టీ నాయకులు బర్రే కొండబాబు, మానే దొరబాబు, కొత్త విజయ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

**టీడీపీ నేతలపై భరత్ రామ్ ఆగ్రహం**

షాడో ఎమ్మెల్యేగా పనిచేస్తూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని సామాన్యులను పట్టుకు పీడించే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం, నగర అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే టీడీపీ నేతలు కరవయ్యారని అన్నారు. టీడీపీ నేతలు మూడు సార్లు మేయర్లుగా, కార్పొరేటర్లుగా వ్యవహరించి ప్రజలకు, నగరానికి ఏమి మేలు చేశారో చెప్పాలన్నారు. గత పుష్కరాలకు రూ.2 వేల కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్టు చంద్రబాబే స్వయంగా చెప్పారని, మరి ఆ నిధులు ఏమయ్యాయో ప్రజలకు తెలియజేయాలన్నారు.

**హామీల అమలు ఘనత వైఎస్ జగన్‌దే**

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నేత, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరపాలకసంస్థ పరిధి 16వ డివిజన్ ఆదర్శ నగర్ 40వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, రాష్ట్ర శెట్టి బలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసెట్టి ప్రసాద్ బాబు(రాజమౌళి), సచివాలయ కన్వీనర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా గొందేశి శ్రీనివాసులు రెడ్డి, పాలిక శ్రీను మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రూ.12.22 కోట్లను సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ కింద ప్రజలకు అందించడం జరిగిందన్నారు. అనంతరం డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్ విడుదల చేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు నాగేంద్ర బాబు, గోపి, ప్రకాష్, ఏర్నగుల జయలక్ష్మి పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి**

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ లబ్ధి చేకూరుతోందని మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం ధవళేశ్వరం సచివాలయం–3 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు రేగుళ్ల రాజు, దాసరి ధర్మ, కల్యాణి రెడ్డి, నంబూరి రవి, ఈవోపీఆర్‌డీ టి.కృష్ణ, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబుతో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల డిజిటల్ బోర్డును తాటికొండ విష్ణుమూర్తి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం సచివాలయం–3 పరిధిలో రూ.36 కోట్లతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపల్లి శివ, పారోజు ముత్యాలు, మద్దాల బాబీ పాల్గొన్నారు.

# వైభవంగా జనార్దనస్వామి మెట్లోత్సవం



మెట్లోత్సవంలో పాల్గొన్న మహిళలు



జనార్దనస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

ధవళేశ్వరం: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం ధవళేశ్వరంలోని జనార్దనస్వామి ఆలయం వద్ద మెట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పుష్పోత్సవం జరిగింది. అనంతరం తిరుమల శ్రీవారి దాస్ సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, హరే శ్రీనివాస భజన బృందాలకు చెందిన సుమారు 400 మంది మహిళలు మెట్లోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కోలాటం ఆకట్టుకుంది. ఉదయం 11 గంటలకు హరినామ సంకీర్తన మహోత్సవం జరిపారు. మెట్లోత్సవానికి తరలి వచ్చిన భజన బృందాల సభ్యులకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.నాగ సురేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు (కాసులు) జనార్దనస్వామి క్షేత్ర మహత్యాన్ని వివరించారు. రాత్రి రామపాద క్షేత్రంలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనార్దన సేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు బ్రహ్మాజీరావు మృతి

కంబాలచెరువు: యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కె.బ్రహ్మాజీరావు శుక్రవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. లింగంపేట పంతం కొండలరావు మున్సిపల్ స్కూలు సమీపంలో శనివారం ఉదయం సంతాప సభ జరగనుంది.

### విద్యార్థులకు దంత పరీక్షలు

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. లెనోరా దంత వైద్య కళాశాల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 160 మందికి దంత పరీక్షలు చేశారు.

### గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు

కంబాలచెరువు: స్థానిక రోడ్డు కం రైల్వే వంతెనపై నుంచి శుక్రవారం ఓ వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. ఏలేశ్వరానికి చెందిన శెట్టి వినోద్‌కుమార్ (32) హుకుంపేటలోని తన అన్నయ్య ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై వంతెనపైకి వచ్చి, ఆ వాహనాన్ని పార్కు చేసి గోదావరిలో దూకాడు. దీన్ని చూసిన స్థానికులు వెంటనే అతడిని రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే అతను మునిగిపోయాడు. వాహనం వద్ద చెప్పులతో పాటు అతడి పర్సులో అతడి ఆధార్‌కార్డు లభించింది. రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

# మహిళల ఆరోగ్యంతోనే సమాజ అభ్యున్నతి

- నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు
- వర్సిటీలో అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని, మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టిని సారించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ డవలప్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో 'ఉమెన్ హెల్త్ అండ్ హైజీన్' అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాలలోను పురుషులతో పోటీ పడుతూ, ఉన్నత స్థానాలలో నిలుస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎంసీ హేమనళిని మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుతో నేటి కాలంలో ఎక్కువ మంది మహిళలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. ఉమామహేశ్వరి మాట్లాడుతూ డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ సహకారంతో యూనివర్సిటీలో టైలరింగ్‌లో రెండు నెలల సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెడుతున్నామన్నారు.

**నన్నయ వర్సిటీ సందర్శన**

ఆదికవి నన్నయ యూనివర్సిటీని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు శుక్రవారం సందర్శించారు. తన గురువైన ఆయనకు నన్నయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు స్వాగతం పలికి, సత్కరించారు.